క్లుప్తంగా

సాక్షిగణపతికి, జ్వాలావీరభద్ర స్వామికి విశేష పూజలు




శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

దేశెట్టికి నంది పురస్కారం



దేశెట్టి శ్రీనివాసులుకు నంది పురస్కారం అందజేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలరు, ప్రముఖ చిత్రకారుడు దేశెట్టి శ్రీనివాసులు నంది పురస్కారం బుధవారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గాన సభ ఫంక్షన్ హాల్‌లో మన కళాక్షేత్రం- మన ఫిలిం ఛాంబర్‌లో చిత్రకారుడు, ప్రజా సేవకుడు దేశెట్టికి మన ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు రాజేందర్, నిర్వహకులు ఫైజున్నీసా నంది పురస్కారం బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మన ఫిలిం ఛాంబర్ సభ్యులు సినీ, టీవీ నటులు కార్తికేయ, రవిశంకర్, రాథోడ్, గాలిపటం సుధాకర్, ప్రొడ్యూసర్స్ శ్రీను పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి

నందికొట్కూరు: ఈనెల 4 నిర్వహించనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మద్రిస్వామి, నవీన్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో విజ్ఞాన్ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ అసమర్థత పాలనలో ఎంతో ప్రతిష్టాత్మకమైన నీట్, నెట్‌కు చెందిన పరీక్ష పత్రాల లీకేజీ కావడం సిగ్గు చేటన్నారు. బీజేపీ పాలనలో 62 సార్లు పేపర్ లీకేజీ అయినా, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. విద్యాసంస్థల బంద్‌కు విద్యా సంస్థలు, ప్రజలు సహకరించాలని కోరారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు



మల్యాలలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

నందికొట్కూరు రూరల్: ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి షేక్షావలి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో రైతులకు గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద వరి విత్తనాలను సబ్సిడీపై అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని రైతులు సబ్సిడీ విత్తనాలను తమ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, రైతులు ఎల్లనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హరికథ



హరికథ వినిపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై మైదుకూరుకు చెందిన కె.ఉదయ్‌కుమార్ వారిచే కిరాతర్జనీయం హరికథ కార్యక్రమం నిర్వహించారు. హార్మోనియం వై.తిరుపతయ్య, తబలా సహకారాన్ని శ్రీనివాసులు అందించారు.

గ్రామాభివృద్ధికి అందరి సహకారం అవసరం

మహానంది: గ్రామాభివృద్ధికి అందరి సహకారం అవసరమని బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు సర్పంచ్ మన్నె జ్ఞానాభరణం అన్నారు. ఏ.కోడూరులో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

సచివాలయాలే దిక్కు!

- శిథిలావస్థలో వీహెచ్‌సీలు
- సచివాలయాల్లోనే వైద్య సేవలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు




పాములపాడులో శిథిలావస్థలో ఉన్న వీహెచ్‌సీ భవనం, పాములపాడులో సుబ్బారెడ్డి ఇంటి వద్ద బీసీజీ వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

పాములపాడు: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే వీహెచ్‌సీ భవనాలు (విలేజ్‌హెల్త్ క్లినిక్) గ్రామాల్లో శిథిలావస్థకు చేరాయి. నిర్మాణంలో ఉన్న నూతన భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గ్రామ సచివాలయాల్లోనే వీహెచ్‌సీలను నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రస్తుత పాలకులు భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

1973లో ఆరోగ్య ఉప కేంద్రం

మండల కేంద్రంలో 1973వ సంవత్సరంలో కుటుంబ నియంత్రణ ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. అప్పట్లో దీనిని పీహెచ్‌సీగా కొనసాగించారు. నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మించడంలో అక్కడకు తరలించి, పురాతన భవనాన్ని ఆరోగ్య ఉప కేంద్రంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం అది శిథిలావస్థలో ఉంది. కొద్ది పాటి వర్షం కురిసినా భవనం అంతా కారుతుంది. అంతేకాకుండా లోతట్టులో ఉండటంతో లోనికి నీరు చేరుతోంది. వచ్చే రోగులు కూర్చునేందుకు కూడా వీలు లేదు. మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతోంది. అలాగే బానుముక్కల గ్రామంలోని భవనం పూర్తిగా వదిలేశారు. గోడలు కూలీ, తలుపులు లేవు. పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులకు స్థావరంగా మారింది. మందులను సంరక్షించుకోవడానికి వైద్య సిబ్బంది పడే తిప్పలు అంతా ఇంతా కాదు.

మండలంలో 12 వీహెచ్‌సీలు..

మండలంలో 14 గ్రామ పంచాయతీలకు గాను మండల కేంద్రంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఈ కేంద్రం పరిధిలో మండలంలోని పలు గ్రామాల్లో 12 వీహెచ్‌సీలు ఉన్నాయి. ఇందులో పాములపాడు, ఇస్కాల, తుమ్మలూరు, బానుముక్కల, మిట్టకందాల గ్రామాల్లో మాత్రమే ప్రభుత్వ భవనాలున్నాయి. మిగతావాటిలో కొన్ని అద్దెభవనాల్లో, మరికొన్ని సచివాలయాల్లో కొనసాగిస్తున్నారు.

సచివాలయాల్లో వీహెచ్‌సీల నిర్వహణ

మండలంలోని బానుముక్కల, యర్రగూడూరు, రుద్రవరం, చెలిమిల్ల, వానాల గ్రామాల్లో గ్రామ సచివాలయాల్లోనే వీహెచ్‌సీలు కొనసాగిస్తున్నారు. బానకచెర్ల గ్రామంలో భవనం నిర్మాణం పూర్తి అయ్యింది. ప్రస్తుతం వైద్య సేవలు కొనసాగుతున్నాయి. అయితే అధికారికంగా స్వాధీనం చేయలేదని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. రూ.17.10 లక్షలతో నిర్మాణంలో ఉన్న యర్రగూడూరు, జూటూరు, మద్దూరు, చెలిమిల్ల, రుద్రవరం గ్రామాల్లో నిర్మాణంలో ఉండగా.. ప్రభుత్వం మారడంతో ఎన్నటికి పూర్తయ్యేనో అని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా



మండలంలో సరైన వసతుల్లేని వీహెచ్‌సీ భవనాల విషయం డీఎంఅండ్‌హెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఉన్నతాధికారుల నుంచి మాకు ఇంకా సమాచారం రాలేదు. వీలైనంత వరకు ఉన్న వసతులతోనే ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నాం. – నాగలక్ష్మీదేవి, వైద్యాధికారిణి

అద్దె భవనాన్ని ఖాళీ చేయమంటున్నారు



ఇంటి యజమాని భవనం ఖాళీ చేయమంటున్నారు. గ్రామంలో ఇంకో ఇంటి కోసం తిరిగినా ఎక్కడా ఖాళీ ఇళ్లు లేవు. నూతన భవనం నిర్మాణంలో ఉంది. త్వరగా పూర్తయితే బాగుంటుంది. తాత్కాలికంగా ఉండేందుకు పంచాయతీ కార్యదర్శిని అడిగాము.
– విమలారాణి, ఏఎన్ఎం, జూటూరు

పరిస్థితి అధ్వానంగా ఉంది



ప్రస్తుతం ఉన్న వీహెచ్‌సీ భవనం అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా భవనంలోకి నీరు వస్తుంది. మా పరిస్థితి చూసి సుబ్బారెడ్డి అనే వ్యక్తి తమ ఇంటి వద్ద నిర్వహించుకోండని చెప్పడంతో ప్రతి రోజు మందులు తీసుకెళ్లి వారి ఇంటి వద్దే వైద్య సేవలందిస్తున్నాము. నూతన భవనం మంజూరుచే చేస్తే బాగుంటుంది. –అనురాధ, ఏఎన్ఎం, పాములపాడు

పాములపాడులో పీహెచ్‌సీ ఉన్నందున నూతన భవనం మంజూరు కాలేదు. ప్రభుత్వం స్పందించి నిర్మాణంలో వాటిని త్వరగా పూర్తి చేయించాలని, పాములపాడులో నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి



పంపిణీ చేసిన విత్తన సంచులను చూపుతున్న నాయకులు

నందికొట్కూరు: రైతులకు ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన విత్తనాలు అందించాలని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం ఆవరణలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న ఏపీ విత్తనాభివృద్ధి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలన్నారు. పక్కా రాష్ట్రాల నుంచి విత్తనాలు మన భూముల్లో వేయడంతో పంట దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారని గుర్తు చేశారు. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ ఫారం భూములు సుమారు 1800 ఎకరాలు ఉన్నాయని చెప్పారు. గత టీడీపీ పాలనలో ప్రైవేట్ కంపెనీలకు కేటాయించి ఫారం భూములను నిర్వీర్యం చేసిందని గుర్తు చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు సోమన్న, సుధాకర్, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి



పిల్లవాడికి ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్టు కృష్ణప్రియ

పగిడ్యాల: ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభ్యున్నతి కోసం స్థానిక భవిత కేంద్రంలో ప్రతి వారం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్యాంప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్టు కృష్ణప్రియ కోరారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. అనంతరం ఆమె పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ వైకల్యం పిల్లలకు శాపం కారాదని, తల్లిదండ్రులు వారి అభ్యున్నతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. భవిత కేంద్రానికి తీసుకొచ్చే పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వం రవాణా భత్యం చెల్లిస్తోందని చెప్పారు. కేంద్రంలో చూపించిన వ్యాయామ ప్రక్రియను బట్టి ఇంటి వద్ద కూడా సాధన చేయించాలన్నారు. దీంతో వారు శారీరకంగా ఆరోగ్యవంతులుగా తయారవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు రామకృష్ణయ్య, అరుణకుమారి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హైవే పనులను అడ్డుకున్న గ్రామస్తులు



పైపులైన్ దెబ్బతిన్న ప్రాంతాన్ని చూపుతున్నసర్పంచు, గ్రామస్తులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీ మజరా కృష్ణారావు పేట గ్రామంలో జరుగుతున్న నేషనల్ హైవే 340సీ పనులను సర్పంచు వరప్రసాద్ గ్రామస్తులతో కలిసి అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలు తిరగడం వల్ల రహదారిలో ఉన్న ప్రధాన పైపులైన్ పగిలిందన్నారు. దీంతో నీరు భారీగా లీకేజీ అవుతుందని, నీరు కూడా కాలుష్యం అవుతుందని చెప్పారు. కంపెనీ వారు అదేమి పట్టించుకోకుండా పనులు చేస్తున్నారని, అక్కడ ఉన్న కంపెనీ వారితో పైపు లైన్ మరమ్మతు పనులు చేసి రహదారి పనులను చేసుకోవాలని చెబితే దురుసుగా మాట్లాడారని చెప్పారు. దీంతో గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టి గ్రామస్తులు గుమికూడటంతో అక్కడ నుంచి వారు వెళ్లిపోయారని తెలిపారు. విషయం తెలుసుకున్న డీఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ విద్యాసాగర్ అక్కడికి చేరుకున్నారు. విషయం కంపెనీ వారికి తెలియజేసేందుకు ప్రయత్నించగా స్పందన లేదన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులు, అంటురోగాల బారిన పడకుండా మున్సిపల్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, సీనియర్ నాయకులు ఎం.రజాక్ కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్‌కు సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్య లోపం వల్ల ప్రజలు అతిసారా వ్యాధితో బాధపడుతున్నారన్నారు. ఆత్మకూరు పట్టణంలో అనేక వార్డుల్లో మంచినీటి కుళాయిల్లో ఇప్పటికీ బురదనీరు, మురుగునీరు వస్తోందని చెప్పారు. కాలువల్లో పూడికలు తీయించి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయించాలని కోరారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, నాయకులు వీరన్న, మహమ్మద్, గణపతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సే ఎమ్మార్పీఎస్ ధ్యేయం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు లింగాల స్వాములు, లోకేష్, ప్రభాకర్

జూపాడుబంగ్లా: సమాజ శ్రేయస్సే ఎమ్మార్పీఎస్ ధ్యేయమని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ లింగాల స్వాములు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో జనజాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1994 జులై 7న ప్రకాశం జిల్లా ఈదుముడులో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు 30 ఏళ్ల కాలంగా ఉద్యమం కొనసాగుతూనే ఉందన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ కోసం పోరాడుతూనే గుండె జబ్బుల బారినపడిన పిల్లల సంక్షేమం కోసం పోరాడి ఆరోగ్య శ్రీకార్డులు అందేలా చేసిందన్నారు. అలాగే వికలాంగుల సంక్షేమం కోసం పోరాడి వారికి పింఛన్ మంజూరయ్యేలా చేయటంలో కీలకపాత్ర పోషించిందన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 7వ తేదీన ప్రకాశం జిల్లా ఈదుముడులో మాదిగల జనజాతర సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయటంతో పాటు వర్గీకరణకు ముక్తకంఠంతో డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లోకేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశాలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ వై.జిష్ణునాగ్ విజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో బీఏ (పొలిటికల్ సైన్స్, హిస్టరీ), బీఏ (పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్), బీకామ్(కంప్యూటర్ అప్లికేషన్, ఎకనామిక్స్), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్), బీఎస్సీ(ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్, మ్యాథమాటిక్స్), బీఎస్సీ (జువాలజీ, బోటనీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చివరిలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించి విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7981214557, 9441082599 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

102 ఎకరాల్లో ఉద్యానపంటలకు అనుమతి

కొత్తపల్లి: మండలంలో 102 ఎకరాలలో ఉద్యాన పంటలు సాగుచేసుకునేందుకు అనుమతులు వచ్చాయని ఏపీఓ రేష్మ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 300 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగుచేసుకునేందుకు ఉన్నతాధికారులు టార్గెట్ ఇవ్వగా అందులో 152 ఎకరాలను ఎస్టిమేషన్ పంపించామన్నారు. అందులో 102 ఎకరాలలో రైతులు ఉద్యాన పంటలు సాగుచేసుకునేందుకు అనుమతులు వచ్చాయని చెప్పారు. సిబ్బంది గ్రామాలలోని రైతుల రికార్డులు సరిచేసుకోవాలని సూచించారు. మొక్కలు కూడా త్వరలో వస్తాయని రైతులకు వాటిని సాగుకు అందిస్తామన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు రూరల్ : 104 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నంద్యాల జిల్లా 104 ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ జగదీష్ కోరారు. బుధవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే జయసూర్యకు కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ 104 సేవలను ప్రభుత్వం పీహెచ్‌సీల ద్వారా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు అబ్దుల్లా, రంగస్వామి, శేఖర్, ఖాజామియ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పొదుపు కార్యాలయంలో పొదుపు సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలు ప్రభుత్వం అందించే రుణాల ద్వారా ఆర్థికంగా ఎదగాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పొదుపు మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీతో రుణాలు ఇవ్వనున్నారన్నారు. ఆత్మకూరు పట్టణంలో పొదుపు సంఘాల మహిళలు రాజకీయాలు చేస్తున్నారని, దీంతో పలు గ్రూపుల్లో విబేధాలు ఉన్నాయన్నారు. అలాంటి వారిని గాడిలో పెడదామన్నారు. గతంలో అవినీతికి పాల్పడిన పొదుపు సభ్యులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో పొదుపు సంఘాల ఆర్‌పీలు, సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా

మహానంది: శ్రీశైలం నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం శింగవరం, వెంగళరెడ్డిపేట గ్రామాల్లో బుధవారం రచ్చబండ, ఓట్ ఆఫ్ థాంక్స్ కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తామని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం పేదలకు అందేలా చూస్తానన్నారు. నాయకులు సైతం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, గ్రామ నాయకులు వెంగళరెడ్డిపేట శ్రీను, రామకృష్ణ, తదిరులు పాల్గొన్నారు.

నేడు మహానందికి రాక

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి గురువారం మహానందికి వస్తున్నట్లు టీడీపీ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి చింతం క్రాంతికుమార్ తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనం అనంతరం తమ్మడపల్లె, అబ్బీపురం గ్రామాల్లో పర్యటిస్తారన్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



మహానందిలో నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న పండితులు, అర్చకులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ నందీశ్వరస్వామికి బుధవారం ప్రదోష కాలంలో అభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు ఆంజనేయశర్మ, హనుమంతశర్మ, అర్చకులు రఘుశర్మలు శాస్త్రోక్త పూజలు చేశారు. ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, నవదేవతాధ్యానం పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. పీఠపూజ అనంతరం అభిషేకం, అలంకారం, అర్చన తదితర వైదీక కార్యక్రమాలు వైభవంగా జరిపించారు. పలు ప్రాంతాల భక్తులు ఆర్జిత సేవల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు.

మహానందిలో భక్తుల రద్దీ

మహానంది ఆలయంలో బుధవారం భక్తులసందడి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు అష్టవిధ మహామంగళ హారతులు, స్థానిక అభిషేకార్చనలు చేపట్టారు.

టీడీపీ నాయకుల బెదిరింపు కాల్స్‌తో ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బోయ మద్దిలేటి

మిడుతూరు: టీడీపీ నాయకులు రాత్రి సమయంలో బెదిరింపు కాల్స్ చేయడంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన, కర్నూలు పట్టణంలో నివాసం ఉంటున్న కొందరు టీడీపీ నాయకులు రాత్రి సమయంలో బోయ మద్దిలేటికి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈనేపథ్యంలో మనస్తాపం చెందిన ఆయన బుధవారం గడ్డి మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స నిర్వహించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ సుబ్బయ్య సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని జరిగిన ఘటనపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ వివరణ కోరగా ఈ ఘటనపై విచారిస్తున్నామని, ఫిర్యాదు అందలేదని.. కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నేడు గుండె జబ్బుల వైద్య శిబిరం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంటలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు ఉచితంగా గుండె జబ్బులకు పరీక్షలు నిర్వహిస్తారని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీశైలం బ్రాంచ్ చైర్మన్ ఎస్.నాగేషు బుధవారం తెలిపారు. కర్నూలు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు బి.పి., షుగర్., ఇ.సి.జి., 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా చేసి రోగులకు మందులు, వైద్యసూచనలు ఇస్తారని పేర్కొన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లోని డాక్టర్స్ ల్యాబ్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

మహానందిలో అంతర్గత బదిలీలకు రంగం సిద్ధం !

మహానంది: మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఏజేన్సీ ఉద్యోగుల విధుల మార్పునకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి బదిలీపై వెళ్లిన నేపథ్యంలో నూతన ఈఓ (ఎఫ్ఏసీ)గా కోటప్పకొండ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత తాజాగా ఉద్యోగుల అంతర్గత బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి, కోదండరామాలయం, ప్రసాదాల(పడితరం)విభాగం, ఇతర స్థానాల్లో ఉన్నవారిని మార్చేందుకు చర్చలు చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో మార్పులు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.